www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 16 ఆగస్టు 2023

5

కాకినాడ



జాతీయ పతాకానికి అవమానం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీలో అపశృతి దొర్లింది. సాతంత్ర్య దినోత్సవాల సాక్షిగా జాతీయ పతాకానికి అవమానం జరిగింది. ఒకసారి కాక రెండు పర్యాయాలు జాతీయ జెండాకు అవమానం కలగడంతో ఈ విషయం సామర్లకోటలో చర్చనీయాంశంగా మారింది. సామర్లకోట మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తుండగా జెండా తెగి నేలపై పడింది. తదుపరి తిరిగా జాతీయ పతాకాన్ని సరిచేసి రెండోసారి ఆవిష్కరించగా జాతీయ పతాకం తలకిందులుగా ఉండడాన్ని అధికారులు ప్రజలు అంత గమనించారు. జాతీయ పతాకానికి అవమానం జరగడంతో చర్చనీయాంశంగా మారింది.

ముహ్వన్నెల పతాక రెపరెపలు

స్వాతంత్ర్య దినోత్సవాలను జిల్లావ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో మువ్వన్నెల జెండాలను ఆవిష్కరించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినా కలెక్టరేట్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని 100 అడుగుల జాతీయ జెండాను కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా మీట నొక్కి ఎగుర వేశారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టరు ఎస్.ఇలక్కియ, డిఆర్ఒ కె.శ్రీధర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ డిఎం డి.పుష్పమణి, ఎడి సర్వే బి.లక్ష్మీ నారాయణ, వికాస పీడీ కె.లచ్చారావు, కలెక్టరేట్ ఎఒ జిఎస్ఎస్ శ్రీనివాసు, వివిధ విభాగాల అధిపతులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

14 మంది వీర సైనికులకు సత్కారం

1971 యుద్ధంలో పాల్గొన్న వీర సైనికులు 14 మందికి ఇన్‌ఛార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీ వంగా గీత, ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ డాక్టర్ సత్యప్రసాద్ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

జెఎన్‌టియుకె ప్రాంగణంలో విసి ప్రొఫెసర్ జివిఆర్.ప్రసాదరాజు జాతీయ జెండాను ఆవిష్కరించి ఎన్‌సిసి క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల గౌరవ వందనం స్వీకరించారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో వేడుకలు ఘనంగా జరిగాయి. డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు , మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కరుణ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యూత్ రెడ్ క్రాస్ వింగ్ కంటింజెంట్స్ గౌరవ వందనం స్వీకరించారు. డాక్టర్ నాయుడు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్‌వింగ్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ వేడుకల్లో వైస్ ప్రిన్సిపల్స్ సత్యనారాయణ, నాగ శ్రీకాంత్, ఇన్‌ఛార్జి మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకర రావు, వంశి, సురేఖ పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో

కాకినాడ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు జాతీయ జెండాను ఎగురవేశారు. 45 మంది ఉద్యోగులకు కమిషనర్ నాగ నరసింహారావు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్య కుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య భవన్‌లో..

సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కె.వీరబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా అనేక మంది పోరాడారని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా ఐక్యంగా పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యానికి నేడు ముప్పు ఏర్పడిందన్నారు. మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాదంతో ప్రజల మధ్య మత చీలికలు తెచ్చి దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తోందని విమర్శించారు. బిజెపి మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో దువ్వా శేషబాబ్జి, కెఎస్.శ్రీనివాస్, పి.వీరబాబు, టి.రాజా, సిహెచ్.రాజ్‌కుమార్, పద్మ, వేణి, ఈశ్వరి, సూరిబాబు, చంద్రరావు, వెంకట్రావు, ప్రసాద్, కష్ణాజీ పాల్గొన్నారు.

పెద్దాపురం సిపిఎం ఆధ్వర్యంలో వరహాలయ్యపేటలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద, నువ్వుల గుంట వీధిలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. రొంగల తాతారావు, నాగూర్, చింతల సత్యనారాయణ, తైనాల శ్రీను జాతీయ జెండాను ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడారు. సిరపరపు శ్రీనివాసరావు, దారపురెడ్డి కృష్ణ, డి.సత్యనారాయణ, ఆర్.వీర్రాజు, అరుణ్, కూనిరెడ్డి రవికుమార్, నరసింహమూర్తి, అప్పన్న, పెంటయ్య, మహాపాతిన రాంబాబు పాల్గొన్నారు. అలాగే మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. టిడిపి కార్యాలయం వద్ద ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, వైసిపి కార్యాలయం వద్ద దవులూరి దొరబాబు, ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి పెంకే సత్యవతి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. **తాళ్లరేవులో** ఎంపిపి రాయుడు సునీత మండల పరిషత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఎంపిడిఒ అనుపమ, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజుబాబు, పాల్గొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ పోతురాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పి.మల్లవరం హైస్కూల్లో ఎంపిసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, ఉంగరాల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి ధూళిపూడి బాబి, ఉప సర్పంచ్ రామకృష్ణ, హైస్కూల్ హెచ్ఎం ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నీలపల్లి సిద్ధార్థ నగర్‌లో వైద్యులు చెక్క సింహాచలం ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, వాటర్ బాటిల్స్, పెన్సిల్స్ అందజేశారు. కార్యక్రమంలో చెక్క త్రిమూర్తులు యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో జాతీయ జెండాను ఎగరవేశారు. రెవెన్యూ కార్యాలయంలో డిటి సత్యనారాయణ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి గంటి మల్ల ధ్యాలక్ష్మి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, ఎంపిడిఒ ఎం.గోవిందు, ఎంఇఒ గాడి కొండబాబు సిబ్బంది తదితరులు ఉన్నారు. **గండేపల్లి** తహశీల్దార్, ఎంపిడిఒ, పోలీస్ స్టేషన్‌లో పతాకాన్ని ఎగరవేశారు. ఎంఇఒ కార్యాలయంలో ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చలగళ్ల దొరబాబు, జెడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగాయారు బాబు, వైస్ ఎంపిపి కుంచే రాజా, తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ, ఎంఇఒ కె.హెచ్.నాయక్, మురారిలో గ్రామ సర్పంచ్ ఆనంద్ ఉప సర్పంచ్, యువ నాయకుడు జాస్తి వసంత్ పాల్గొన్నారు. **తొండంగి** కొత్త పెరుమాళ్లపురంలో సూర్య విద్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యాలయ చైర్మన్ కోమాకుల శివ ప్రసాద్ రావు, కో మాకుల ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సూర్య ప్రకాశరావు, మంజుల దంపతుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 77 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** మండలంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ పెండెం దొరబాబు వాకతిప్ప, కొత్తపల్లి హైస్కూల్లో జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎంపిపి కారే సుధా శ్రీనివాస్, వైస్ ఎంపిపి మామిడాల వెంకటేశ్వరరావు, చెట్టుబత్తుల సురేష్ కుమార్, సర్పంచులు ఉమ్మిడి మేరీ జాన్, గవర నాగేశ్వరరావు, పాలని దొరబాబు, కర్రి చిన్నారావు, రావి రమేష్, నక్క మణికంఠ పతాకాలను ఎగరవేశారు. **పిఠాపురం** ఆర్‌బిటి హెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్లో ఎంఎల్ఎ పెండెం దొరబాబు జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. డిజిటల్ క్లాస్ రూమ్‌ను ప్రారంభించారు. కోర్టు ఆవరణలో 12వ అదనపు జిల్లా కోర్టు జడ్జి వాసంతి, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యవతి, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కన్నాబత్తుల కామేశ్వరరావు, ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయం ఆవరణలో బ్రాంచ్ మేనేజర్ రాము చౌహాన్ జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. పట్టణంలోని సుందరయ్య ప్రసాదరావు భవనం వద్ద జాతీయ జెండాను సిపిఎం సీనియర్ నాయకులు కోనేటి రాజు ఎగురవేశారు. పార్టీ నాయకులు కె.చిన్నప్పసారావు, నాగేశ్వరరావు, కె.మణి, వీరబాబు,డి గోపాలకృష్ణ,గంగన్న, చిరంజీవి, గోవిందాచారి, సత్తిబాబు, సింహాచలం, సత్తిబాబు. ఎన్ నూకరాజు,పి సూర్యచక్రం, సూర్య ప్రకాష్ రావు. జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు. **జగ్గంపేట** టిడిపి కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ జాతీయ జెండాను ఎగురవేశారు. **ఏలేశ్వరం** ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, రెవెన్యూ కార్యాలంయలో తహశీల్దారు చిన్నబ్బాయి, పోలీసు స్టేషన్‌లో జి.సతీష్, విద్యుత్ కార్యాలయంలో ఎఇ సూర్యనారాయణ, పంచాయితీ కార్యాలయాల్లోసర్పంచులు జెండా ఆవిష్కరణలు చేశారు. **కరప** మండలంలోని కార్యాలయంలో కె.అప్పారావు, పి.శ్రీనివాసరావు, కెబి.కృష్ణవేణి, ఎన్.రామకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్ నాయక్, డాక్టర్ ఎం.కె.సౌజన్య, జెడ్‌పిటిసి వై.సుబ్బారావు, ఎంపిపి శ్రీలక్ష్మీ సత్తిబాబు, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. **సామర్లకోట రూరల్** ప్రభుత్వ క్లష్టరు ఆసుపత్రి వద్ద వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పతాకాన్ని ఆవిష్కరించారు. మండల కార్యాలయంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిపి డి.శ్రీలలిత, ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఇఒపిఆర్‌డి కె.హరికృష్ణసత్యారెడ్డి, ఉపాధి హామీ ఎపిఒ ప్రభాకర్, రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.లక్ష్మీనరసకుమారి, డిటి ఆర్.శ్రీనివాసు, పోలీస్ స్టేషన్ వద్ద సిఐ కె.దుర్గాప్రసాద్ పతాకావిష్కరణలు చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కరణం ప్రసాదరావు గాంధీ నగర్‌లోని మహిళా సంఘం నాయకురాలు వరలక్ష్మి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. బల్ల మార్కెట్ సెంటర్‌లో సయ్యపురెడ్డి యువరాజు ఆవిష్కరించారు. సురేష్, మహేష్, యువరాజు, వరలక్ష్మి, కోన శివ, బాలం శ్రీను, బాలం సత్తిబాబు, బాలం శ్రీహరి, శ్రీను, కష్ణ, గోవిందరాజు, పి.వీరబాబు, సింహాచలం పాల్గొన్నారు.



సుందరయ్య భవన్‌లో సిపిఎం ఆధ్వర్యాన..



జెండాను ఆవిష్కరించిన మంత్రి అప్పలరాజు



సామర్లకోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కరణం ప్రసాదరావు

మతోన్మాదంపై పోరాటమే అమరులకు నిజమైన నివాళి

కాకినాడ ప్రతినిధి : మోడీ బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలపై, దేశ ప్రజలను విడదీసే మతోన్మాదంపై పోరాడడమే స్వాతంత్ర్యోద్యమ అమరవీరులకు మనమిచ్చే ఘన నివాళి అని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 12 గంటల వరకూ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. వీటిని దువ్వా కొట్టి సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబీరాణి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సామ్రాజ్యవాద బ్రిటిషర్లతో పోరాడి స్వాతంత్రం సాధించి నేటికి 77 ఏళ్లు గడుస్తున్నా దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు నిరుద్యోగాన్ని, పేదరికాన్ని, నిత్యావసర ధరలను పెరుగుదలను అరికట్టలేకపోయారన్నారు. మహిళలపై అత్యాచారాలు, గిరిజనులపై, దళితులపై, మైనారిటీలపై దాడులను బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాద సంస్థలు ప్రోత్సహిస్తూ కులమత దేశప్రజల మధ్య విభేదాలను పెంచుతూ, భారత రాజ్యాంగ స్థానంలో మనుస్మృతి, ప్రజాస్వామ్యం స్థానంలో ఫాసిస్టు విధానాలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి అమరవీరులకు నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు జాతీయ ఉద్యమ స్ఫూర్తిని రగిలించే కళారూపాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజకుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, నగర అధ్యక్ష, ఉపాధ్యక్షులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, దళిత ఉద్యమ నేత ఐతాబత్తుల రామేశ్వరరావు, ఎపిఎస్ఎస్ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దుంపల ప్రసాద్, చిట్టుల వెంకటరావు, యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, కాకినాడ రూరల్ అధ్యక్షులు తానిషా, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు వర్మ, ఐప్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, నగర అధ్యక్షులు భారతి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి రమణమ్మ, జ్యోతి, రిటైర్డ్ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిబాబు, ప్రజానాట్యమండలి కాకినాడ పట్టణ కార్యదర్శి లోవరాజు పాల్గొని ప్రసంగించారు.



కాకినాడలో సిఐటియు సభలో మాట్లాడుతున్న శేషబాబ్జి

ప్రజా సంక్షేమం, సత్వరాభివృద్ధి లక్ష్యం : మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజా సంక్షేమం, సత్వరాభివద్ధి లక్ష్యాలుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న ప్రాధాన్యతా పథకాలు జిల్లాలో విజయవంతంగా అమలవుతున్నాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సమష్టి భాగస్వామ్యంతో జిల్లా అన్ని రంగాల్లో ప్రగతి పథంలో పయనిస్తోందని రాష్ట్ర పశు సంవర్ధక, డెయిరీ, మత్స్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మంగళవారం కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లాస్థాయి 77వ భారత స్వాతంత్ర్య దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు పరిపాలనను మరింత చేరువలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా నూతనంగా ఏర్పడిన కాకినాడ జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తోందని తెలిపారు. వైఎస్ఆర్ రైతు భరోసా, పిఎం కిసాన్ పథకాల ద్వారా ఈ సంవత్సరం జిల్లాలో 1.74 లక్షల మంది రైతులకు రూ.131 కోట్ల సహాయాన్ని రైతుల ఖాతాలకు నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన 3,996 మంది రైతులకు రూ.3.23 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందించినట్లు వెల్లడించారు. జగనన్న పాలవెల్లువ (అమూల్) కార్యక్రమం కింద జిల్లాలో 133 పాల శీతలీకరణ కేంద్రాలు, 171 పాల సేకరణ కేంద్రాలు నిర్మిస్తున్నామని తెలిపారు. మత్స్య ఉత్పత్తుల రంగంలో జిల్లా రాష్ట్రంలో 3వ స్థానంలో ఉంది. ఈ ఏడాది 24 వేల 147 మెరైన్ మత్స్యకార కుటుంబాలకు రూ.24.15 కోట్లు వేట నిషేధ సమయంలో పరిహారం అందించామన్నారు. 2022-23 రబీ సీజన్‌లో 84,161 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల సేకరించామన్నారు. రైజ్ కార్యక్రమం ద్వారా 8,450 మంది విద్యార్థులకు ఆంగ్ల భాషా నైపుణ్యాలలో ప్రత్యేక శిక్షణ కల్పించామన్నారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పెరేడ్ మైదానంలో వివిధ శాఖల శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. అన్నవరం దేవస్థానం, జిల్లా గ్రామీణాభివద్ధి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పౌర సరఫరాలు, విద్యా శాఖ, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్, పశుసంవర్ధక శాఖ -జగనన్న పాల వెల్లువ, గ్రామీణ నీటి సరఫరా, ఆరోగ్యశ్రీ-104, 108, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాలు, అగ్నిమాపక, విపత్తు స్పందన వివిధ శాఖలకు చెందిన శకటాలను ప్రదర్శించారు. వీటిలో జిల్లా విద్యాశాఖ శకటానికి మొదటి, పౌర సరఫరాల శాఖ శకటానికి ద్వితీయ, పశుసంవర్ధక శాఖ శకటానికి తృతీయ బహుమతి లభించింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్ల మంగళవారం అవార్డులు ప్రదానం చేశారు.


ప్రజాశక్తి-యంత్రాంగం


కాకినాడ కార్పొరేషన్‌కు సంబంధించి జిల్లా స్థాయిలో ఎనిమిది మందికి అవార్డులు దక్కాయి. నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావుతో పాటు పలువురు అధికారులు, సచివాలయ కార్యదర్శులకు అవార్డులు అందజేసి అభినందించారు. అవార్డులు స్వీకరించిన వారిలో ఎస్ఇ పి.సత్య కుమారి, ఎంహెచ్ఒ డాక్టర్ పథ్వీ చరణ్, టిపిఆర్ఒ మానే కృష్ణమోహన్, శానిటరీ ఇన్స్పెక్టర్ లాజర్, మరో ముగ్గురు సచివాలయ కార్యదర్శులు ఉన్నారు. **అన్నవరం** అచ్చంపేట, అన్నవరం ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ ఎం.షహజద్ ఆలీ ఉత్తమ సేవ అవార్డు అందుకున్నారు. ఆలీని ఆసుపత్రి సిబ్బంది అన్నవరం, అచ్చంపేట గ్రామస్తులు అభినందనలు తెలిపారు. **తాళ్లరేవు** సిహెచ్‌సి సూపరింటెండెంట్ పి.శిరీష, తహశీల్దారు ఎస్.పోతురాజు, విఆర్ఒ కాలా సత్యనారాయణ పాల్గొన్నారు. **ఏలేశ్వరం** అవార్డు గ్రహీతల్లో ఏలేశ్వరం నగర పంచాయతీ మేనేజర్ కె.శ్రీనివాసరావు, ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ భానుతేజ, విద్యుత్ ఎఇ సూర్యనారాయణ, విఆర్ఒ అవసరాల తిరుమలరావు, మహిళ పోలీస్ స్వర్ణపూడి ప్రవళిక ఉన్నారు. **పెద్దాపురం** తహశీల్దారు వజ్రపు జితేంద్ర, వ్యవసాయ శాఖ అధికారి కె.సంజయ్ కుమార్, మున్సిపల్ ఎఇ కృష్ణ జీవ ప్రసాద్, ఎంపిడిఒ కార్యాలయ సబార్డినేట్ కె.మీనాక్షి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. **జగ్గంపేట** వ్యవసాయ విస్తరణ అధికారి జి.వీరశంకర్‌కు సేవా పురస్కారం లభించింది.



మంత్రి అప్పలరాజు నుంచి అవార్డులు అందుకుంటున్న అన్నవరం ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ షహజద్ ఆలీ, ఏలేశ్వరం మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు

కార్టూ'నిజం'





గడప గడపకూ కార్యక్రమంలో ఎంఎల్ఎ సూర్యనారాయణ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-పెదపూడి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లలమామిడాడలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్థానికంగా ఉండే సమస్యలపై ఆరా తీసి వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు చేకూరిన లబ్ధిని వివరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి సిఎంగా ఆశీర్వదించాలని కోరారు. ఎంపిపి కేతా తులసి శ్రీనివాస్, వైస్ ఎంపిఇ ద్వారంపూడి పద్మా వెంకటరెడ్డి, జెడ్‌పిటిసి పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ లంక మున్ని, వైస్ సర్పంచ్ మేడపాటి తాతరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సబ్బెళ్ల మోహన్ రెడ్డి, మండ రాజారెడ్డి, శ్రీ సూర్య లైన్స్ క్లబ్ అధ్యక్షులు కడిమి శ్రీనివాసు పాల్గొన్నారు.

ఎస్ఐ విద్యాసాగర్‌కు ఉద్యోగోన్నతి

జగ్గంపేట : జగ్గంపేట ఎస్ఐ సిహెచ్ విద్యాసాగర్‌కు సిఐగా ఉద్యోగోన్నతి లభించింది. మంగళవారం ఏలూరు రేంజ్ పరిధిలోని 20 మంది ఎస్ఐలకు సర్కిల్ ఇన్స్పెక్టర్లగా ప్రమోషన్ కల్పిస్తూ డిఐజి ఉత్తర్వులు ఇచ్చారు.

కుందరాజుకు పలువురి నివాళి

గండేపల్లి : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అడబాల కుంద రాజు మృతితో ఉప్పలపాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి సోమవారం సాయంత్రం విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందడంతో మంగళవారం ఉప్పలపాడులో అంత్యక్రియలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గం ఇన్‌ఛార్జి మరోతి శివ గణేష్, నాయకులు శ్రీవత్సవాయి సత్యనారాయణ రాజు, డాక్టర్ నక్క సత్యనారాయణ, చంద్రమౌళి వెంకటరత్నం, అవసరాల వెంకటాచల సుధాకర్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. కుంద రాజు తనయుడు అడబాల ఆంజనేయులు, వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఇపిఎఫ్ పెన్షనర్ల దీక్ష

ప్రజాశక్తి-కాకినాడ

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇపిఎఫ్ 1995 పెన్షనర్లు మంగళవారం స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద జిల్లా అధ్యక్షులు కె.రమణమూర్తి అధ్యక్షతన సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎపిఆర్‌పిఎ ఎపి రాష్ట్ర కోశాధికారి సిహెచ్.సత్యనారాయణరాజు ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ 1995 కింద కవర్ చేయబడిన పెన్షనర్లు, మినిస్ట్రీ ఆఫ్ లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్, కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ద్వారా నిర్వహిస్తున్నారన్నారు. దేశంలో ఇపిఎఫ్ పింఛనుదారులు ఆర్థిక, అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపిఎఫ్ 95 పింఛన్‌దారులు 75 లక్షలకు పైగా దేశంలో ఉండగా, 2 లక్షలకు పైగా ఆంధ్రప్రదేశ్ లో ఉన్నారన్నారు. తమ నెలవారీ పెన్షన్‌ను రూ.500 నుండి రూ.3500 మాత్రమే అన్నారు. అది కూడా సెప్టెంబరు, 2014 నుండి ఎటువంటి మెరుగుదల లేదన్నారు. వృద్ధాప్యంలో మనుగడ కోసం సరైన ఆహారం, ఔషధాల కోసం చాలా ప్రమాదకరమైన జీవితాన్ని గడుపుతున్నామన్నారు. రాష్ట్ర కోశాదికారి సి.హెచ్.సత్యనారాయణరాజు శిభిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇ.పి.ఎస్.పెన్షనర్ల సమస్యలు పట్ల కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ముఖ్య మంత్రులు విజ్ఞప్తులు పెడచెవిన పెట్టి బాధ్యతా రహితంగా ఆర్థిక లేమి పేరుతో తప్పించుకుంటున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడుతూ ఇప్పటికే దేశవ్యాప్తంగా ఇ.పి.ఎస్.పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.ఆర్.టి.సి.రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘం అధ్యక్షులు ఒ.రాంబాబు, ప్రధాన కార్యదర్శి వై.త్రిమూర్తులు, సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడారు. ఆర్.టి.సి.పెన్షన్ సంఘం నాయకులు డిఆర్.మోహనరావు, పి.ఎస్.నారాయణ, వైఎస్.నారాయణ, జిల్లా కార్యదర్శులు జోగా అప్పారావు, యుఎస్ఎన్.రెడ్డి, కర్రి బాబూరావు, బార్నబాస్, సాయిబాబు, కాశీవిశ్వనాద్, నారాయణరావు, మోహనమురళి, బొజ్జా అశోక్, ఎం.రామకృష్ణ, జి.రామకృష్ణ, వి.రమణ పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

నేరాలు ఘోరాలు

సముద్రంలో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

సముద్రంలో స్నానానికి దిగి యువకుడు గల్లంతైన సంఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం ఎన్.కొత్తపల్లి పంచాయతీ రాఘవుల పేటకు చెందిన కొప్పాడి సతీష్ డిగ్రీ చదువుతున్నాడు. ఆగస్టు 15 సందర్భంగా తన స్నేహితులు 15 మందితో కలిసి మంగళవారం ఎస్.యానం బీచ్‌కు వెళ్లారు. అనంతరం సముద్రంలో స్నానానికి దిగిన సతీష్ అలల తాకిడికి స్నేహితులే కళ్ళెదుటే గల్లంతయ్యాడు. సంఘటన తెలుసుకున్న అమలాపురం రూరల్ సిఐ వీరబాబు, ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు, సిబ్బంది అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి అయినా సతీష్ ఆచూకీ లభ్యం కాలేదు. అతడి కోసం గాలిస్తున్న ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు


ప్రజాశక్తి-ఆత్రేయపురం

పేకాట శిబిరంపై మంగళవారం ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తన సిబ్బందితో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ర్యాలి గ్రామం కేశవ స్వామి గుడి సమీపంలోనీ లాడ్జ్‌లో పేకాట ఆడుతున్న 9 మంది వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.22.390 వేల నగదు స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సామర్లకోటలో 1వ వార్డు ఏకగ్రీవం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం పరిధిలో నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం పవర 5వ వార్డుకు కోట లక్ష్మీదుర్గ ఏకగ్రీవంగా సింగిల్ నామినేషన్‌తో ఏకగ్రీవవంగా ఎన్నికయ్యారు. చంద్రంపాలెం నాలుగో వార్డుకు తలారి వెంకట సుబ్బారావు, తోట మణికంఠలు పోటీలో ఉండగా వేట్లపాలెం 14వ వార్డుకు కాకాడ రవి శేఖర్, బత్తిన ఏసుబాబు, బొబ్బరాడ రాజులు త్రిముఖ పోటీలో ఉన్నట్లు స్టేజ్-1 రిటర్నింగు అధికారులు పివిఆర్ మణిదీప్, జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 19న శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్నాహ్నం 1గంట వరకూ పోలింగు, 2 గంటల తరువాత కౌంటింగ్ చేపట్టిన ఫలితాలు ప్రకటించనున్నట్లు వారు తెలిపారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక పట్టాభి అగ్రో ఫుడ్స్ లోహిత బ్రాండ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సభలో సంస్థ డిజిఎం జి.వెంకటరమణ, సుబ్రహ్మణ్యం ద్వారా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో బహుమతిలు సాధించిన కె.సాయి వీరేంద్ర(ప్రథమ), సిహెచ్.సాయి సూర్య(ద్వితీయ), పి.ఉదయ చంద్రిక (తతీయ), ఎన్.సందీప్, (ప్రత్యేక), అరవింద సాయి (ప్రత్యేక)ను అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ భాస్కరమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రాజీవ్ గృహకల్ప కాలనీలో గుంపులుగాతిరుగుతున్న కుక్కలు

కుక్కల స్వైరవిహారం

బెంబేలెత్తిపోతున్న ప్రజలు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్డు మీద నడవాలంటే భయపడిపోతున్నారు. ఇటీవల కాలంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ వాహనాదారులు, పాదచారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ద్విచక్రవాహనాల వెనుక పరిగెత్తి వారిపై దాడి చేస్తున్నాయి. దీంతో వాటిని తప్పించుకొనే నేపథ్యంలో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పలు వీధులలో కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో ఎప్పుడు ఎవరి మీద దాడి చేస్తాయోనన్న ప్రజలు భయంతో వణికిపోతున్నారు. సుమారు 10 నుండి 20 కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ విద్యార్థులకు, బాటసారులపై దాడి చేస్తున్నాయి.

గతంలో కుక్కల దాడిలో చిన్నారి ఒకరు ప్రాణాలు కోల్పోవడం, పలువురు వీటి దాడిలో గాయపడిన సంఘటనలు ఉన్నాయి. కొన్ని కుక్కలు పిచ్చి పట్టి తిరుగుతున్నాయని అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా రాత్రి సమయాల్లో ఇవి అరుస్తుండటంతో తీవ్ర భయాందోళన చెందుతున్నామని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించకుంటే వీటి దాడికి మరి కొంతమంది గాయలపాలు కాకా తప్పదని ప్రజలు అంటున్నారు. కనీసం కుక్కల సంతానోత్పత్తిని అరికట్టి, వాటి సంఖ్యను తగ్గించే చర్యలు చేపట్టాలని నాయకులను, అధికారులను ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెట్టలో ఎండుతున్న వరి పొలాలు

ప్రజాశక్తి-కోటనందూరు


అల్లిపూడిలో ఎండిపోయి బీటలు వారిన వరి పొలం

20 రోజుల నుంచి విస్తారంగా ఎండలు కాయడంతో వరి పొలాలు ఎండిపోయి బీటలు వాడడంతో మెట్ట ప్రాంత రైతులు గగ్గోలు పెడుతున్నారు. జూన్, జూలై నెలలో అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడం వల్ల మండలంలో అల్లిపూడి, కాకరాపల్లి, గ్రామాలలో వరినట్లు వేశారు. మరో ఎనిమిది గ్రామాల్లో నారుమళ్ల వేయడానికి దుక్కులు దున్ని విత్తనాలు చల్లారు. మరికొన్నిచోట్ల దుక్కులు దున్నారు. బోర్లు సదుపాయం ఉన్న పల్లపు ప్రాంతాల్లోనూ వరి నాట్లు వేశారు. ఆగస్టు మొదటి వారం నుంచి విస్తారంగా ఎండల కాయడం వల్ల ఆకుమళ్లు ఎండిపోయాయి, వరి నాట్లు వేసిన పంట పొలాలన్నీ బీటలు వారాయి. తొక్కుదిండిన వరి పొలాలన్నీ ఎండిపోయాయి. దీనితో దిక్కుతోచని పరిస్థితుల్లో మెట్ట ప్రాంత రైతాంగం తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఇప్పటికే వరి విత్తనాలు క్రిమిసంహారక మందులు రేట్లు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. డీజిల్ ధరలు అధికంగా పెరిగిపోవడంతో ట్రాక్టర్‌తో దుక్కు దున్నడానికి ఒక్కొక్క గంటకు రూ.1100 వరకు వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఒక్కక్క ఎకరానికి రూ.15000 వరకూ పెట్టుబడి పెట్టామన్నారు. కష్టపడి పంటలను సాగు చేస్తున్నప్పటికీ వాతావరణం సహకరించకపోవడంతో వరి పంటలన్నీ ఎండిపోయి బీటలు వారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదిలోనే హంస పోతున్నట్లుగా తొలి దశలోనే పొలాలు ఎండిపోవడంతో ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులకు పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి -కరప


పురస్కారాలు అందిస్తున్న జెడ్‌పిటిసి

కరప నక్క సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు జడ్‌పిటిసి వై.సుబ్బారావు, ఎంపిపి పి.శ్రీలక్ష్మి మంగళవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 1992-93లో నక్కా సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.లక్ష నిధిని బ్యాంక్‌లో డిపాజిట్ చేశారని, ఆ వడ్డీ, ఫ్రెండ్స్ సహకారంతో దాదాపు సంవత్సరానికి రూ.20,000 సాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం వరకూ చింతా నారాయణ మూర్తి తన మాతృమూర్తి జ్ఞాపకార్థం పదో తరగతి 1, 2, 3, 4 నలుగురికి జ్ఞాపికలను బహూకరించారు. గురజనాపల్లిలో పబ్బినీడి పాపారావు జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వచ్చిన విద్యార్థులకు మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రెటరీ జెఎన్టియు ప్రొఫెసర్ డాక్టర్ శివరామకృష్ణ వారి తాతయ్య పేరు మీద మెడల్స్ సర్టిఫికెట్స్ ప్రైజ్ మనీ అందజేశారు. మానవత్వం అధ్యక్షులు చక్కపల్లి ప్రభాకర్ ప్రథమ ద్వితీయ తతీయ స్థానాల్లో వచ్చిన విద్యార్థులకు స్మార్ట్ బ్రాండ్ వాచ్‌లను ఉచితంగా అందజేశారు. మానవత్వం సలహాదారులు పబ్బినీడి సాంబ వారి తండ్రి పేరుమీద పబ్బినీడి వెంకటేశ్వరరావు మెమోరియల్ అవార్డు కింద ప్రైజ్ మనీ, మరొక సలహాదారులు పబ్బినీడి కనకరాజు ప్రైజ్ మనీని స్కూలు గ్రంథాలయ నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి జ్యోతి, మద్దూరి సత్యలక్ష్మి, మాధవరపు ప్రసాద్, కూనపురెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలబాలాజీని దర్శించుకున్న నగరం ఎస్ఐ సురేష్

ప్రజాశక్తి-మామిడికుదురు


ఎస్ఐసురేష్‌ను సత్కరించిన దృశ్యం

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామిని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నగరం ఎస్ఐ పివిఎస్ఎస్ఎన్.సురేష్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు చేయగా సహాయ కమిషనర్ జి.మాధవి, ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఎస్ఐకు శ్వేత వస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు. అనంతరం ఎస్ఐ రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలసి బోన్సాయ్ మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు టీ షర్ట్స్ అందజేత

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి



విద్యార్థులతో వాకర్స్ క్లబ్ సభ్యులు

ఆటల్లో ప్రతిభ చూపుతున్న ఉప్పాడ కొత్తపల్లి హైస్కూల్లో పేద విద్యార్థులకు మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో టీషర్ట్స్, షూస్ అందించారు. వైస్ ఎంపిపి మాదిరెడ్డి దొరబాబు పలువురికి టీ షర్టులు అందించగా వాకర్స్ క్లబ్ సభ్యులు టీ షర్టులు, షూస్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు ఆటలాడేందుకు మొక్కువ చూపుతున్న వారికి సరైన సౌకర్యాలు లేకపోవడంతో దానియల్ అనే క్రీడాకారుడు తమ దృష్టికి తీసుకురావడంతో తమ వంతు సాయం అందించినట్టు చెప్పారు. ఎవరైనా పేద విద్యార్థులు ఉండి ఆటలు ఆడేందుకు ముందుకు వస్తే వారిని ప్రోత్సహించే విధంగా వాకర్స్ క్లబ్ ముందుంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థులకు ఉపయోగపడే సామాగ్రి కావాలని తమ దృష్టికి తీసుకువస్తే వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి మాదిరెడ్డి దొరబాబు, వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు చోడిశెట్టి సతీష్, అధ్యక్షులు, కొవ్వూరి విజయ్, బంధన మణికంఠ, జగన్నాథం, బద్రి సానా నాగు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్


పేరూరులో శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అరుణ

అమలాపురం రూరల్ మండలం పేరూరు భీమభక్తునిపాలెం, పేరూరు పేట లలో సుమారు రూ. 3 లక్షల పంచాయతీ నిధులతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులకు గ్రామ సర్పంచ్ దాసరి అరుణడేవిడ్ మంగళ వారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చోల్లంగి సబ్బురాం, దొంగ ఆంజనేయులు, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పారిశుధ్య లోపం

ప్రజాశక్తి-ఆత్రేయపురం


ప్లాస్టిక్ గ్లాసుల్లో వృద్ధి చెందుతున్న లార్వా

గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. డ్రైనేజీల్లో ఖాళీ ప్రదేశాలలో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండడంతో వాటిలో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు ఉత్పత్తి లార్వా తయారవుతోంది. దీంతో దోమల బారిన పడి అనేకమంది రోగాల బారిన పడుతున్నారు ప్రతిశుక్రవారం వైద్య సిబ్బంది డ్రై డే కార్యక్రమం సక్రమంగా నిర్వహించకపోవడం పంచాయితీ పాలకులు గ్రామాలపై దృష్టి పెట్టకపోవడం పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు పంచాయతీలలో నిధులు లేకపోవడం వంటి సమస్యలు పట్టిపీడించడంతో ప్రజల రోగాల బారిన పడి రూ.వేలకు వేలు మూల్యం చెల్లించు కుంటున్నారు. గ్రామాల్లో ఉంటూ ఎప్పటికప్పుడు అంటురోగాలు ప్రబల కుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మోడీ, జగన్‌లను సాగనంపాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్

ప్రజాశక్తి - అమలాపురం

కేంద్రంలో మోడీ, రాష్ట్రలో జగన్‌లను ఇంటికి సాగనంపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ అన్నారు. మోడీ, జగన్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్రాన్ని కాపాడండి , దేశాన్ని రక్షించండి అంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 17న విశాఖలో బస్సుయాత్ర ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. అమలాపురంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ యాత్ర రాష్ట్రంలో 26 జిల్లాల్లో పర్యటించి వచ్చే నెల 8న తిరుపతిలో భారీ బహిరంగ సభతో ముగుస్తుందని తెలిపారు. సిపిఐ బస్సు యాత్రను ఈనెల 17న విశాఖలో ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజిత్ కౌర్ ప్రారంభిస్తారని తెలిపారు. సెప్టెంబర్ 8న తిరుపతిలో జరిగే ముగింపు సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతారన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీలకు కారు చౌకగా కట్టబెడుతున్నారన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. 32 మంది ఆత్మబలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ చేయడం ద్వారా కార్మిక వర్గానికి తీరని ద్రోహం తలపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష మంది ప్రత్యక్షంగా పరోక్షంగా ఈ పరిశ్రమపై ఉపాధి పొందుతున్నారన్నారు. గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను అదానీకి అమ్మడం ద్వారా విశాఖ ఉక్కు ముడి ఖనిజం రవాణా కాకుండా అడ్డుకొని విశాఖ ఉక్కు పరిశ్రమకు నష్టాలు చూపిస్తున్నారని ఆరోపించారు. విభజన హామీలైన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఇచ్చిన హామీలను అటకెక్కించి రాష్ట్రానికి మోడీ తీరని నష్టం చేకూర్చారన్నారు. రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్ కేంద్రాన్ని నిలదీయలేని అసమర్థుడు అని ఎద్దేవా చేశారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడారు. రాష్ట్రంలో దళితులు, మైనారిటీలు, ప్రతిపక్షాలపై దాడులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిఒ 1 రద్దు పై రాష్ట్ర హైకోర్టు మొట్టికాయలు వేసినా వైసిపి పాలనలో మార్పు లేకపోవడం దారుణమన్నారు ఈ సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రాము అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో దేవా రాజేంద్రప్రసాద్, శీలం వెంకటేష్, నిమ్మకాయల శ్రీనివాస్, కె.రామకృష్ణ, రవికుమార్, చెల్లిబోయిన శ్రీనివాస్, వెంకటేష్ సత్తి రాజు జంపన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందజేస్తున్న అధికారులు

తపాలా శాఖలో 2023-ఎక్సలెన్స్ అవార్డులు

ప్రజాశక్తి-కాకినాడ

డిపార్ట్‌మెంట్ ఆఫ్ పోస్ట్స్ డివిజనల్ ఎక్సెన్స్ అవార్డ్స్ 2022-2023 కార్యక్రమం స్థానిక సూర్య కళా మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ డివిజన్ అధికారి చుక్కా శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తపాలా శాఖలో అంకిత భావంతో పనిచేసే ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపి ప్రోత్సాహం అందించేందుకు గాను ఈ అవార్డులు అందజేశామని చెప్పారు. పెరిగిన పోటీ ప్రపంచంలో ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు ఎన్ని వచ్చినా నేటికీ తపాలా శాఖ ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదన్నారు. పోటీని తట్టుకుని ప్రజలకు ఇంకా దగ్గరయ్యేందుకు తపాలా శాఖ కొత్త కొత్త ఆవిష్కరణలు రూపొందిస్తోందన్నారు. పోస్టల్ శాఖ కార్యకలాపాల్లో నిబద్ధతతో పనిచేస్తున్న ఉద్యోగులను గుర్తించి వారికి సముచిత గౌరవం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ పబ్లిక్ రిలేషన్ అధికారి మూర్తి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

బడి, అంగన్‌వాడీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రంగవల్లి నగర్ కాలనీలో సుమారు 150 మందికి పైగా బడి ఈడు పిల్లలు ఉన్నారని, ఆ పిల్లలకు ప్రైమరీ, అంగన్వాడి స్కూలు ఏర్పాటు చేయాలని మంగళవారం రంగవల్లి నగర్‌లో ఎపి రైతు కూలీ సంఘం, పిడిఎస్‌యు ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఎపి రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఈ కాలనీలో నిరుపేదలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఈ కాలనీలో మౌలిక వసతులు డ్రైనేజీలు, రోడ్లు, కుళాయిలు ఏర్పాటు చేయాలని అనేకమార్లు ప్రభుత్వాధికారులకు విన్నవించుకున్నా ఫలితం శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కడితి సతీష్, రైతు కూలీ సంఘం నాయకులు సురేష్, సోమరాజు, మహిళా సంఘం నాయకులు దేవి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.


బండారుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న బుల్లియ్య

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షునికి ఘన సత్కారం

ప్రజాశక్తి-అంబాజీపేట

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు కొత్తపేట ఇంచార్జ్ బండారు సత్యానందరావు ను అంబాజీపేట ఎన్‌టిఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపిక అందజేసి స్వీట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌సి నాయకులు చిన్నం బాల విజయారావు, బండారు సత్తిబాబు, ధర్నాల రామకృష్ణ, వీరబాబు గల్లా అశోక్, మోకా శ్రీను, బండారుకు శుభాకాంక్షలు తెలిపారు.


ప్రధానోపాధ్యాయులకు విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఉన్నత పాఠశాలకు రూ.25 వేల విరాళం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా అమలాపురం రూరల్ మండలం పేరూరు డిఎన్.శెట్టి, డివి.రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు మంగళవారం 1996-1997 బ్యాచ్ పూర్వ విద్యార్థుల తరపున ప్రధానోపాధ్యాయులు మట్టపర్తి పురుషోత్తం రాజు కు సెంట్రల్ సౌండింగ్ సిస్టం ఏర్పాటుకు రూ.25 వేలు విరాళం అందించారు . ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కడలి భాస్కర రావు, పేరూరు పంచాయతీ ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యుడు దొంగ ఆంజనేయులు, దొమ్మేటి సుబ్రహ్మణ్యం, దొమ్మేటి శ్యామ్ ప్రకాష్, జల్లి శ్రీను,చెల్లుబోయిన రమేష్, దొమ్మేటి రాధాకష్ణ తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు


వందనం చేస్తున్న మంత్రి లక్ష్మీనారాయణన్, ఎంఎల్ఎ అశోక్

యానాంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాంలో స్వాతంత్ర్య దినోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో పుదుచ్చేరి ప్రజాపనులశాఖ మంత్రి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా వేడుకల్లో పాల్గొన్నారు. యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌తో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. మంత్రి, ఎంఎల్ఎతో పాటు ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్‌పి రఘునాయగం శాంతి కపోతాలను, త్రివర్ణ బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. పోలీసులు, హోమ్ గార్డులు, ఆయా పాఠశాలలకు చెందిన స్కౌట్ దళాలు భారీ కవాతు నిర్వహించాయి. పలు పాఠశాలలు విద్యార్థినులు వివిధ నృత్యాలను ప్రదర్శించారు. ఈ నృత్యాలు ఆద్యంతం అందరినీ అలరించాయి. ఉత్తమ కవాతు, నృత్య ప్రదర్శనలకు మంత్రి, ఎంఎల్ఎ బహుమతులు, మెమెంటోలు అందచేశారు. ముందుగా మంత్రి లక్ష్మీ నారాయణన్ స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని ఇచ్చారు. స్థానిక ప్రముఖులు, నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఎల్ఎ గొల్లపల్లి ఆయన కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. లయన్స్ క్లబ్ పిల్లరాయ యానాం, నెహ్రూ యువ కేంద్ర, రీజెన్సీ పబ్లిక్ స్కూల్, శ్రీవేద, డ్రీమ్స్ పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవాలు ఘనంగా జరిగాయి.

జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా యానాం ఓల్డ్ ఏజ్ హోమ్ ఆధ్వర్యంలో ఓల్డ్ ఏజ్ హెూం వ్యవస్థాపకులు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తన అభిమానులతో కలిసి జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. యానాం ప్రధాన రహదారుల్లో ర్యాలీని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మల్లాడి అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 4 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి - యానాం

అప్పర్ డివిజినల్ క్లర్క్ (యూడీసీ) పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను సెప్టెంబర్ 4 నుంచి 7వ తేదీ వరకూ పుదుచ్చేరి సెక్రటేరియట్లోని మూడో అంతస్తులో ఉన్న కాన్ఫరెన్స్ హాలులో పరిశీలించనున్నట్లు డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ కార్యదర్శి వి.జయశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలు, ఎస్ఎస్‌సి, నివాస, కమ్యూనిటీ సర్టిఫికెట్లను వెంట తెచ్చుకోవాలన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న ప్రతినిధులు



మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

స్థానిక బాలయోగి స్టేడియంలో స్వాతంత్ర దినోత్సవాలను తిలకించడానికి వచ్చిన ప్రజలకు, విద్యార్థులకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అభిమానులు మంగళవారం సుమారు 2 వేలు అమూల్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు .ఎండ వేడిమి ఎక్కువ ఉండడంతో దాహార్తిని తీర్చేందుకు బొండాడ సుబ్రహ్మణ్యం సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.